
# కథ - ముగింపు



ఆఫీసునుండి వచ్చి అలా ఇంటిలో అడుగుపెట్టానో, లేదో "శ్రీహరికోట నుండి సత్య ఫోను చేసింది!" అంది సుభద్ర. సుభద్ర మా ఆవిడ.

"సత్య ఫోను చేసిందా?" నా ప్రశ్నలో చిన్నపాటి ఆందోళన ధ్వనించిందేమో ...

"మరేం కంగారులేదులెండి. అంతా కులాసానా అని అడిగింది!" అంది.

"దానికి ఫోనెందుకు?"

"ఒకటికి రెండు మూడుసార్లు పెదనాన్నగారు ఇంటికింకా రాలేదా అని అడిగింది. మీతోటేదైనా మాట్లాడాలేమో!"

ఆఫీసు ఉడుపులు విప్పేసి, వాష్ చేసుకుని వచ్చి టీవీ ముందు పడక కుర్చీలో సెటిల్ అయిపోయానే కానీ, ఈ సమయమంతా సత్య ఎందుకు ఫోను చేసి ఉంటుందా అన్న ప్రశ్న నా చుట్టూ ముసిరే ఉంది.

శ్రీహరికోటలో సత్య ఒంటరిగా ఒక్కతి....

సత్య అంటే సత్యకామేశ్వరి. మా శేషు కూతురు. శేషు మా తమ్ముడు. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉంటూ మూడు సంవత్సరాల క్రితం అకస్మాత్తుగా పోయాడు. వాడు పోయేనాటికి సత్య బి.కామ్. మొదటి సంవత్సరంలో ఉంది.

వాడి ఉత్తరకర్మలు అయిన మరునాటికి వచ్చిన బంధువులంతా ఎటువారటుగా వెళ్లిపోగా రెక్కలు రాని పక్షిలా సత్య, రెక్కలు తెగినపక్షిలా మా మరదలు విశాలాక్షి పొంగిపొరలుతున్న దుఃఖంతో ...

వారితోపాటు "జననంలో ఉన్న క్రమం, మరణాన ఎందుకు లేనట్లు ...? నాకంటె చిన్నవాడు ముందెళ్లిపోవటమేమిటి?" అని అలలు అలలుగా పొంగెత్తుతున్న దుఃఖాన్ని నిలువరించుకోలేక, నేను, అంతా నిస్సహాయంగా ఒకరికెదురుగా మరొకరం మిగిలిపోయాం.

"మీరూ ... వాళ్లముందలా కనిపిస్తే ఇంకా వాళ్ల గుండెలు అవిసిపోవూ! లేవండి!" అని నన్నూ,

"చూడమ్మా, విశాలా! పోయినవారితో మనమూ పోలేముగా ...! ధైర్యం కూడకట్టుకోవాలి. ఇక మనం ఆలోచించాల్సింది ఈ సత్యను, దాని భవిష్యత్తు గురించి!" అని మా మరదలు విశాలాక్షిని హెచ్చరించింది సుభద్ర.

సుభద్ర అనునయ వాక్యాలు వింటూనే విశాలాక్షి ఒక్కసారి పెద్దగా బ్రేకయి "నాకే దిక్కూ తోచటం లేదక్కా!" అంది.

విశాలాక్షిని పొదివి పట్టుకుని, ఊరడిస్తూ "పోయిన మరిదిగారిని తీసుకునిరాలేం కానీ , మీ కెవ్వరూ లేకపోవటమేమిటి, మేం లేమూ! మనమంతా విజయవాడ వెళ్తున్నాం. సత్య చదువు అక్కడ కొనసాగిస్తుంది!" అంది సుభద్ర.

"అవునమ్మా!" అన్నాను నేను.

సత్యను, విశాలాక్షిని తీసుకుని విజయవాడ వచ్చేశాం. సత్య కాలేజీలో చేరింది. బి.కామ్ చేస్తూనే టైపు, షార్ట్‌హేండ్, లోయర్, హయ్యర్ పాసైంది. బి.కామ్. కాలేజి ఫస్ట్ వచ్చింది.

ఎప్పుడు అప్లై చేసిందో శ్రీహరికోట రాకెట్ కేంద్రం 'షార్' ఎస్టాబ్లిష్‌మెంట్‌లో స్టెనో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది.

"అప్పుడే ఉద్యోగం ఎందుకమ్మా ... ఎం.కామ్. చేయరాదూ!" అన్నాను.

"ఎం.కామ్ దేముందీ ... ప్రైవేటుగా చేస్తాను, పెదనాన్నగారూ!" అంది.

విశాలాక్షి, సుభద్ర "ఆడపిల్ల ... ఒంటరిగా ... అంతదూరమా!" అన్నారు.

మమ్మల్ని ఒప్పించటం సత్యకు కొంచెం కష్టమే అయినా, ఒప్పించగలిగింది. కొత్తతరం ఆలోచనలు పాతతరపు మా ఆలోచనలను మింగేశాయి.

ఇంటర్వ్యూ నుండి తిరిగి వచ్చిన సత్య, ఆ ఆర్గనైజేషన్‌లో తనకు ఎంత మంచి ప్రమోషనల్ చాన్సెస్ ఉన్నాయో, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు స్థాయి వరకు ఎలా ఎదగవచ్చో చెప్పింది. ఆ 'షార్' ఆవరణలో ఉద్యోగినులకు క్వార్టర్స్, ప్రత్యేకమైన డైనింగ్ రెస్టారెంట్స్ ఎలా ఉన్నాయో చెప్పింది. మరో సంవత్సరానికి తనకు సెపరేట్ క్వార్టర్స్ ఇస్తారని, అప్పుడు తాను తనతో విశాలాక్షిని తీసుకుని వెళ్లవచ్చని చెప్పింది.

సత్య స్టెనోగా శ్రీహరికోటలో చేరిపోయింది. శ్రీహరికోట నుండి ప్రతి పది పదిహేను రోజులకు తన క్షేమసమాచారలను తెలుపుతూ జాబులు వ్రాసేది.

అలాంటిది, ఈ రోజే ఫోను చేసింది ఎందుకో?

టీ.వీ.లో వార్తలు ముగిసేపాటికి, సుభద్ర రాత్రిళ్లు నేను తినే రొట్టెలు తెచ్చి నా ముందుంచింది. అంతలోనే ఫోను రింగ్ అయింది.

"ఆఁ ... మీ పెదనాన్నగారేనా ... ఇదిగో ఉన్నారు!" అంటూ సుభద్ర, ఫోను నాకిచ్చింది.

"సత్యా! ఎవిటిరా అమ్మడూ!" అన్నాను.

"ఏం లేదు, పెదనాన్నగారూ! ఈ రోజే నన్ను

'షార్' అడిషనల్ డైరెక్టరుగారి స్టెనోగా మార్చారు. ఇది ప్రమోషన్ కాదు కానీ, మెరిట్‌కో గుర్తింపు: ఈ పోస్ట్‌లో చిన్నపాటి శ్రమపాలతోపాటు, కొన్ని ప్రివిలేజస్ కూడా ఉంటాయి. నా క్వార్టర్స్‌కు ఫోనిచ్చారు. ప్రస్తుతం దానినుండి మాట్లాడుతున్నాను!" అంది.

"ఏమిటీ, అఫీషియల్ ఫోనిచ్చారు. గుడ్! ఫోను నంబరెంత?"

"ఫోను నంబరు 25121, పెదనాన్నగారూ! నాకిక్కడ చాలా బాగుంది. కెరియర్‌లో ఎదగటానికి చక్కని వాతావరణం. ఆఫీసు అవర్స్ అయ్యాక కావలసినంత తీరిక. పోస్టల్ కోచింగ్ ద్వారా ధార్వాడ్ యూనివర్సిటీ ఎం.కాం. చేస్తున్నాను. ఇంకా ఎంతో తీరిక సమయం మిగిలిపోతోంది. చుట్టూ మంచి సొసైటీ ... లైవ్లీగా ఉండే ఫ్రెండ్ సర్కిల్. కాలం హాయిగా గడిచిపోతోంది.

"మరో విషయం పెదనాన్నగారు! బహుశా ఈ స్ఫూర్తి మీ నుండేనేమో ... నాలో సాహిత్యాభిలాష. మా కిక్కడ మంచి లైబ్రరీ ఉంది. నా చుట్టూ ఉన్న వాతావరణానికి స్పందించి నేనూ కథలు వ్రాస్తున్నాను. అయితే వాటిని ఏ పత్రికకూ పంపించటంలేదు. ఓ మంచి కథ వ్రాయగలిగాక, దానిని ముందు మీకు పంపుతాను. ప్రముఖ కథకులైన మీ ఆశీస్సులు అందాకే, ఏ పత్రికకైనా పంపటానికి సాహసిస్తాను."



# గంధం యాజ్ఞవల్క్యశర్మ

"మంచిదిరా, సత్యా!" అన్నాను.

సత్య ఫోను పెట్టేసింది.

"ఏమిటీ, చాలాసేపు మాట్లాడారు?" అంది సుభద్ర.

"సత్య కథలు వ్రాస్తోందట. ఓ మంచి కథ వ్రాశాక నాకు పంపుతుందట!"

"మీకా ... ఎందుకో ...?" అంది సుభద్ర. అలా అనటంలో కొంచెం వెటకారం చూపింది సుభద్ర.

నేను నలభై ఏళ్లుగా కథా రచయితగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నా, నా కథలు సుభద్ర మెప్పు పొందలేకపోయాయి. నేను ఈ విషయంలో ఇన్నాళ్లూ ఇంట గెలవలేదు.

నేనో విషాదాంత కథా రచయితను మాత్రమే అని సుభద్ర అభిప్రాయం.

విషాదం సుభద్రకు నచ్చదు.

***

సత్యకు ఫోనొచ్చాక జాబులు వ్రాయటం మానేసింది. వారం వారం తానే ఫోను చేసి మాట్లాడుతుంది.

ఎందుకనో ఈ మధ్య నాలుగు వారాలుగా

సత్య ఫోనే చేయలేదు. ఒకటికి రెండుసార్లు "సత్య ఫోను చేయటం లేదేమిటి?" అంది సుభద్ర. మేమే ఫోను చేద్దామనుకుంటే చిత్రంగా ఫోను నంబరున్న టెలిఫోన్ల నంబర్లున్న పాకెట్ డైరీ పుస్తకం కనిపించింది కాదు.

సమయానికి విశాలాక్షీ లేదు. తన తమ్ముడు రమ్మని రాస్తే భోపాల్ వెళ్లింది. తనకు తెలుసా నంబరు.

అదిగో ... ఆ సమయాన ఓ రోజు సత్య నుండి పెద్ద కవరొకటి వచ్చింది.

"పెదనాన్నగారూ! ఈ మధ్య ఓ కథ వ్రాశాను. ఆ కథకు ప్రేరణ, నాతోపాటే నా క్వార్టర్స్‌లో ఉంటున్న ఓ ఆత్మీయురాలి కథే! ఆ అమ్మాయిని చుట్టి ఉన్న సంఘటనలు, పరిణామాలు, వాటినంటి ఉన్న సమస్యలను కథగా మలిచాను.

"మీరంటూ ఉంటారుగా కథ లైఫ్ నుండి రావాలని. ఆ అమ్మాయి తాను లోనవుతున్న అంతర్మథనాన్ని నా ముందుంచింది. దాన్ని ఆధారంగా కథ వ్రాశాను. కానీ ఈ కథకు సరైన ముగింపేమిటో స్ఫురించటం లేదు.

"ఈ కథకు సరైన ముగింపు దొరికితే బహుశా, ఆ అమ్మాయి సమస్యకూ సరైన పరిష్కారం దొరికినట్లేనేమో ... ఈ జాబుతో, ఆ కథ పంపుతున్నాను. మీ రా కథకు మంచి ముగింపు సజెస్ట్ చేస్తూ, లబ్ధప్రతిష్ఠులైన కథకులుగా, రచయిత్రిగా నాకో మార్గం నిర్దేశం చేయండి.

"నమస్కారాలతో,

"సత్య."

జాబంతా విన్న సుభద్ర "ఊఁ, కానివ్వండి, విషాదంతమేగా మీ ముగింపు!" అంది.

సత్య పంపిన కథ విప్పాను.

***

ఎం.ఏ. శోషియాలజీ చేసిన సరిత నెల్లూరు నుండి వచ్చి 'షార్' ఎస్టాబ్లిష్‌మెంట్‌లో అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసరుగా చేరింది. ఆమెకు అక్కడ సోషియాలజీలో పిహెచ్.డి. చేసి వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న భార్గవ్, తన పై ఆఫీసరుగా పరిచయమయ్యాడు.

భార్గవ్‌లో వివేకాన్ని, గొప్ప కలుపుగోలుతనాన్ని గుర్తించింది సరిత.

సరితలో గొప్ప సంస్కారాన్ని, వినయాన్ని చూశాడు భార్గవ్. ఇద్దరూ తమతమ విధి నిర్వహణలో భాగంగా గంటల కొలదీ కలసిమెలసి ఉండవలసి రావటం కారణంగా, కొద్ది మాసాలలోనే వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది.

సరితకు భార్గవ్‌లోని కార్యదక్షత, సునిశితతత్వం పట్ల గౌరవం ఏర్పడగా ... భార్గవ్‌కు సరిత సౌజన్యం పట్ల, ఆమె తనపై చూపుతున్న గౌరవ



"నిన్నరాత్రి ఆ హీరో డబల్ ఏక్షన్ చేసిన సినిమా చూశావుకదా...ఎలా ఉంది?"
"తలనొప్పి తగ్గడానికి రెండుమాత్రలు వేసుకోవలసి వచ్చింది."
-ప్రతాపవెంకట సుబ్బారాయుడు, సికిందరాబాదు

ప్రవత్తులకు ఏవో మర్యాదకరమైన కొత్త అర్థాలు తోచాయి. అతనికి తెలియకుండానే ఆమెను తన జీవిత భాగస్వామిగా ఊహించుకునే ఒక మధురానుభూతికి, ఆకర్షణ కాని, ఒక ఆరాధనా భావనకు గురి అయ్యాడు.

కానీ సరిత స్థితి వేరు.

సరిత వివాహం ఏనాడో తన మేనత్త కొడుకు రాజాతో ముడివేయబడి ఉంది.

సరిత మేనత్త పెళ్లి అయిన కొద్ది సంవత్సరాలకే భర్తను కోల్పోయి, రెండు సంవత్సరాల కొడుకు రాజాతో వచ్చి అన్నగారింటనే ఉండిపోయింది. ఒకచోటనే పెరిగిన సరిత, రాజా చిన్ననాటినుండీ కానున్న భార్యాభర్తలుగా నిర్ణయింపబడ్డారు పెద్దలచేత.

రాజా ఇంజనీరింగ్ పాసై, పిహెచ్.డి. చేసేందుకు స్టేట్స్‌కు వెళ్లగా ఉద్యోగం చేయవలసిన అవసరం లేకున్నా, ఊసుపోకకు షార్‌లో అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసరుగా ఉద్యోగంలో చేరింది సరిత. స్టేట్స్ నుండి రాజా తిరిగి వచ్చాక తాను ఉద్యోగం మానేస్తుంది.

ఈ విషయాలు తెలియని భార్గవ తన మనసున సరితపట్ల ఆలోచనలను, సరితతోకాక, అతనికి సన్నిహితుడైన మిత్రుడూ, సహ ఉద్యోగి అయిన రామనారాయణ దగ్గర వెల్లడించటం, భార్గవ్ చేసిన చిన్న పొరపాటు.

రామనారాయణ దాన్ని భార్గవ, సరిత మధ్య నెలకొన్న పరస్పర అవగాహనగా భావించి నలుగురి దగ్గర, వారిద్దరూ కానున్న దంపతులు అని మాట్లాడాడు మంచి మనసుతోనే. ఈ విషయం ఆనోటా, ఆ నోటా పడి సరిత వరకూ చేరింది.

సరిత దీన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది.

ఒక చదువు, సంస్కారం ఉన్న వ్యక్తిగా భార్గవ్‌ను తాను గౌరవిస్తే, దాన్నతడు దుర్వినియోగపరచినట్లు భావించింది. ఏకపక్షంగా అతడో నిర్ణయం తీసుకుని, దానిని తనపై రుద్దాలని ప్రచారం ప్రారంభించాడనుకున్న సరిత, దాన్ని సహించలేకపోయింది. ఆమెలో వల్లమాలిన కోపం పెల్లుబికింది.

భార్గవ్ ఛాంబర్స్‌కు వెళ్లి అక్కడ మరెవ్వరో ఉండగానే "మనమధ్య ఉన్న అధికార సంబంధాలను, నేను మీకిచ్చిన గౌరవ మర్యాదలను మీరింత నీచంగా దుర్వినియోగపరుస్తారని అనుకోలేకపోయాను!" అంటూ చాలా ఆవేశంగా నాలుగూ దులిపేసింది.

భార్గవ నిశ్చేష్టుడైపోయాడు.

ఊహకైనా రాని ఈ పరిణామాన్ని తట్టుకోలేకపోయిన భార్గవ్, పది రోజులు సెలవుపెట్టి తన స్వస్థలం గుంటూరు వెళ్లిపోయాడు.

ఈ ఉదంతం షార్ అంతా గుప్పుమంది.

మహిళా ఉద్యోగినులంతా, ఎందుకో సరితను తెగ అభినందించారు. భార్గవనెరిగిన తతిమావారందరూ ... 'అయ్యో! ఇలా ఎందుకు జరిగింది?' అనుకున్నారు.

ఆవేశం చల్లారాక, తాను కొంచెం ఎక్కువ రియాక్టయ్యానేమో అనుకుంది సరిత. తానూ ఒక వారం సెలవు పెట్టి నెల్లూరు వెళ్లింది మానసికంగా కొంచెం రిలాక్సయ్యేందుకు.

నెల్లూరు చేరిన మరునాడే స్టేట్స్ నుండి రాజా ఆ చిరునామాకే ఒక జాబు వ్రాశాడు సరితకు.

"సరితా!

మనం ఒకరినొకరం ప్రేమించుకుని దంపతులమవుదాం అనుకున్న వాళ్లం కాదుగా ... అలా బాసలు చేసుకున్న వాళ్లమూ కాదు కదూ! వాళ్ల తృప్తికోసం మన పెద్దలు అలా ఊహించుకున్నారు. అంతే! అందుకు మన బాధ్యతేముంది?

ఇక్కడ నాతోపాటు రిసెర్చ్ చేస్తున్న మార్గరెట్, నేనూ మనసులు ఇచ్చి పుచ్చుకున్నాం. మాకు మన పెద్దల ఆశీస్సుల మాట ఎలా ఉన్నా, నీ శుభాకాంక్షలు తప్పక ఉంటాయి కదూ!" అంటూ వ్రాశాడు.

ఆ జాబు చూసిన సరిత నాన్నగారు మండిపడ్డారు.

సరిత మేనత్తగారైతే సరిత తన కోడలు కాకపోతున్నందుకు గగ్గోలు పెట్టింది.

సరిత రాజా జాబుతో అప్పటివరకూ తాను అనాలోచితంగా బందీగా ఉన్న పెద్దల నిర్ణయంలోని లోపాన్ని చూడగలిగింది.

అవును, రాజాకూ తనకూ మధ్య ఉన్నది కేవలం బంధుత్వం మాత్రమే.

"బావ చేసిన తప్పేం లేదు. దంపతులవ్వటానికి కావలసినది కుటుంబ సంబంధాలు కావు, పెద్దల నిర్ణయాలూ కావు!

కానున్న దంపతులమధ్య నెలకొనాల్సిన అవగాహన, స్పందనలూను!" అంటూ తండ్రికి, మేనత్తకు నచ్చచెప్పి వారిని శాంతింపచేసింది సరిత.

"కంగ్రాట్స్, బావా!" అంటూ రాజాకు జాబు కూడా వ్రాసిపడేసింది.

అప్పుడు ఎందుకో భార్గవ జ్ఞాపకం వచ్చాడు సరితకు. తాను పెట్టిన సెలవు పూర్తి కాకుండానే శ్రీహరి కోటకు తిరిగి వచ్చిన సరితకు, అక్కడ భార్గవ్ వ్రాసిన జాబొకటి ఎదురు చూస్తో కనిపించింది.

"సరితగారూ!

మీ మనసును చదవటంలో తొందరపడటమే కాదు, దారుణంగా పొరపాటుపడ్డానేమో! కానీ ఒకటి నిజం. మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. అందులో ఎలాంటి మాలిన్యమూ లేదు.

అంతమాత్రాన మీ మనసును నొప్పించే హక్కు నాకు లేదు, క్షమించండి. మీకు మళ్లీ కనిపించి మిమ్మల్ని బాధపెట్టను.

"భార్గవ."

ఆ జాబును పలుమార్లు చదువుకుంది సరిత.

తొందరపడ్డాను, పొరబడ్డాను, క్షమించమంటున్నాడు భార్గవ.

తొందరపడి పొరబడ్డది తానా, భార్గవా! ఖిన్నురాలైంది.

ఆఫీసుకు వెళ్లిన సరితకు భార్గవ ఉద్యోగానికి రాజీనామా చేశాడని తెలిసింది. ఆ వార్త విని తెల్లబోయింది. కళ్లవెంట కన్నీరుబికింది. ఆ పెల్లుబికిన కన్నీటినిండా తల వంచుకుని దూరంగా తొలగిపోతున్న భార్గవ రూపమే కనిపించింది. వెంటనే వెళ్లి భార్గవను క్షమించమని వేడుకోవాలనుకుంది. కానీ భార్గవ ఏడి?

ఆఫీసులో ఏ పని చేయబోయినా, ఏ ఫైలు తెరిచినా భార్గవ రూపమే! అతని జ్ఞాపకాలే ... అతని మాటలే వినిపించినట్లు ... అతని చిరునవ్వులే మౌనంగా ప్రతిధ్వనించినట్లు ...

సరిత చుట్టూ నిస్పృహ ... పశ్చాత్తాం!

***

సత్య రాసిన కథ అక్కడ ఆగిపోయింది.

"పై కథలో అతి కొంచెమే కల్పితం. తతిమాదంతా వాస్తవ చిత్రణే!" అంటూ, ఆ కథక్రింద సత్య ఒక నోట్‌లాంటిది రాసింది.

ఆ కథను మళ్లీ మళ్లీ చదివాను.

ఆ కథలో ఏముంది? అతి సామాన్యమైన ప్రేమ కథ. రెండు మూడు ముగింపులను సూచించవచ్చు.

ఒకటి ఇక నీకు కనిపించి బాధపెట్టను అన్న భార్గవ, సరితకు శాశ్వతంగా కనపడకుండా పోయేందుకు ఆత్మహత్యలాంటి దారుణానికి ఒడిగొట్టడం. రెండు సరిత, భార్గవ్‌లు మళ్లీ జీవితంలో కలుసుకోలేకపోయారు అనే ఒకే ఒక్క వాక్యంతో కథ ముగియటం.

మూడు తన అనాలోచిత చర్యకు లోలోన బాధపడుతూ సరిత జీవితాంతం అవివాహితగా మిగిలిపోయి, తనలాగే మిగిలిపోయిన భార్గవను జీవిత చరమాంకంలో కలుసుకుని విచారించటం.

ఈ ముగింపులన్నీ 'బీటెన్ ట్రాక్' ముగింపులే. ఈ కథకు అంతకంటే మంచి ముగింపులు ఉండవు. అవేం గొప్ప ముగింపులూ కావు. మొదటిసారిగా కథా రచయిత్రిగా సాహితీ రంగంలో కాలిడబోతున్న మా సత్య ఇలాంటి సాదా సీదా కథ రాయటం నాకిష్టం లేదు. ఆ విషయం సత్యకు చెప్పాలనుకుని, ముందు సుభద్రకు చెప్పాను.

సుభద్రా ఆ కథ చదివింది.

"ఈ కథకు మీరనుకున్నవే ముగింపులు కావు. సత్య ఏమన్నదో గమనించారా, ఈ కథకు సరైన ముగింపు దొరికితే, బహుశా ఆ అమ్మాయి సమస్యకూ సరైన పరిష్కారం దొరికినట్లేనేమో అంది!"

"ఉండండి, మన సత్యను పిలిచి వాళ్ల స్నేహితురాలితో మాట్లాడి, ఈ కథకు ముగింపేమిటో చెపుతాను. శ్రీహరికోట ఫోన్ నంబరు సత్యరాసిన జాబులో ఉంది, డయల్ చేయండి!" అంది సుభద్ర.


సత్య నంబరు డయల్ చేశాను. అటు ఫోనెత్తారు "హలో...!" అంటూ. సత్య గొంతుక కాదు, మరో గొంతుక.

"చూడమ్మా ... విజయవాడ నుండి సత్య పెదనాన్నగారిని!" అన్నాను.

"నమస్కారం అంకుల్! సత్య ఇప్పుడే బయటకు వెళ్లింది. మరో అరగంటలో రావచ్చు. ఏమైనా చెప్పమంటారా?"

"నీ పేరేమిటమ్మా?"

"మీ అమ్మాయేమిటి అలా గోడచాటు కెళ్లి మాట్లాడుతోంది?" అని ప్రశ్నించాడు పెళ్లిచూపుల కొచ్చిన పెద్దమనిషి.



"మా అమ్మాయే...సినిమాల్లో డబ్బింగ్ ఆర్టిస్టుగా చేస్తోంది." జవాబిచ్చాడు అమ్మాయితండ్రి.

-ప్రతాపవెంకట సుబ్బారాయుడు,
సికిందరాబాదు

"నేను మిసెస్ వనజా రంగనాథ్. నేను సత్యలా స్టైనోనే అంకుల్! సత్య క్వార్టర్స్‌లోనే ఉంటున్నాను."

"మరి సరిత ఎవరు?"

"సరితనా ... అలాంటి పేరున్న వారెవరూ ఇక్కడ లేరంకుల్! మేమిద్దరమే ఈ క్వార్టర్స్‌లో ఉంటోంది!"

"అలానా ... ఇదిగో, సత్య దొడ్డ ... అదే మా ఆవిడ మాట్లాడుతుందట, మాట్లాడు!" అని సుభద్రకు ఫోనిచ్చాను.

"చూడమ్మా, మీ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో భార్గవ అని ఎవరైనా ఉన్నారా?" ప్రశ్నించింది సుభద్ర.

అవతలవైపు నుండి ఏదో నాకు వినిపించని జవాబు.

సుభద్ర నుండి తరచి తరచి ఏవేవో ప్రశ్నల పరంపర. జవాబులు విన్న సుభద్ర మోముపై ఆశ్చర్యపు ముద్రలు. వాళ్ల సంభాషణాసారం నాకు అవగతం కాలేదు కానీ, వీరిలా ఎంతసేపు ఎస్.టి.డి.లో మాట్లాడుకుంటూ ఉండిపోతారా అని ఆశ్చర్యపోతూ ఉండిపోయాను.

దగ్గర దగ్గర అరగంట మాట్లాడిన సుభద్ర "వనజా! చాలా థాంక్స్ అమ్మా ... ఈ కథ సుఖాంతమే అవుతుందిలే!" అంటూ ఫోను పెట్టేసి, నాకేసి తిరిగి "ఎస్.టి.డి. బిల్లు ఎంత వస్తుందో అనుకుంటున్నారు కదూ ... ఎంత వచ్చినా మీకేం నష్టం లేదులెండి!" అంది.

సుభద్ర అంటున్నదేమిటో అర్థం కాలేదు.

"వెంటనే భోపాల్ ఫోన్ చేస్తారో, టెలిగ్రామే ఇస్తారో విశాలాక్షిని పిలిపించండి. మనం అంతా గుంటూరు వెళ్లాలి!"

"ఎందుకు?" అన్నాను.

"ఎందుకా ... ఈ కథను ముగించటానికి. ఇప్పుడు ఈ కథ ముగింపు మీరు కాదు చెప్పేది, నేను."

అయోమయంగా చూస్తున్న నాకేసి ఓ చిరునవ్వు నవ్వి, "ఈ కథలోని సరిత మరెవ్వరో కాదు ... మన సత్య! ఆ భార్గవ అనబడే కథానాయకుడు గుంటూరులో ఉన్నాడు. మరి వాళ్ల పెద్దవాళ్లతో మాట్లాడాలిగా ... గుంటూరు అందుకు!" అంది సుభద్ర.

***

సత్య, భార్గవలను ఒకచోటకు చేర్చి, వాళ్లకు పెళ్లి జరిపించి వాళ్ల కథకు సుఖాంతపు ముగింపునిచ్చి తానో రచయిత్రిగా ఆవిర్భవించిన సుభద్ర, నేనేదో చేయి తిరిగిన గొప్ప రచయితను అనుకుంటున్న నా నితాంత గర్వాన్ని నిలువునా నీరుకార్చేసింది.

■